# అశ్వహృదయము

శ్రీశ్రీశ్రీ వత్ససాయి చతుర్భుజ తిమ్మ జగపతిమహారాజుకి ఉదయం గరిడి సాములూ, సాయంకాలం పంచకల్యాణి ఎక్కి షికారు వెళ్ళడమూ తప్పని నిత్యకృత్యాలు.

ఎప్పుడైనా ప్రళయం వంటి ఆ సందర్భము తటస్థించి గరిడిసాములు మానెయ్యడం, జరిగితే జరగవచ్చు, కాని గుర్రపు స్వారీ మాత్రం కట్టిపెట్టడానికి వీలులేదు.

అలా జరగనినాడు ఆ పంచకల్యాణి నానా హంగామా చేసేస్తుంది.

కోట అంతా గగ్గోలు పరిచేస్తుంది.

ఒకనాడేం జరిగిందంటే?

ఆ వేళ సాయంత్రం దీపాలు పెట్టగానే సంగీత కచేరీ ప్రారంభం కావలసి వుంది.

అయితే నెల్లూరి నుంచి వొక గజ ఆటగాడు వచ్చి వుండగా, అప్పటికి తేల్చుకోలేక పోతామూఅని మహారాజు జామున్నర పొద్దువేళ చదరంగంలో కూచున్నాడు.

మొదటి జాముకి అనుకూలంగానే నడిచింది, గాని నాలుగవ పొద్దువేళ, అక్కడ శ్రోతలొక్కక్కరే వచ్చి కిక్కిరిసిపోతూ వున్న సమయములో యిక్కడ ఆట బిగిసిపోయింది.

రాజెంత మెళుకువగా యెత్తులు వేసినా మొదటి వుజ్జీ గుర్రం పట్టుపగ్గాల్లేకుండా చెలరేగిపోసాగింది.

గుర్రంబారి పడకుండా రాజును తప్పించుకుంటూ, బంట్లతో పిడికి తాళుకుంటూ, మధ్య మధ్య తన మంత్రితో వుసికొలుపుతూ అతి కష్టం మీద నిలవతొక్కుకుని  మహారాజు స్వగతంగా నిట్టూర్పు విడిచాటప్పటికి. కింద నుంచి"గుర్రం గుర్రం" అంటూ పెద్ద గందరగోళం వినవచ్చింది.

మొదట వసారాలో వున్న పరిచారిక "పంచకళ్యాణి కట్టుతాళ్లు తెంపుకుంది" అని ఆత్రంగా అంది.

తరువాత సన్నిధిని ఉన్న గుబ్బెతలలో నొకతె వెళ్ళి చూసి వచ్చి "పంచకల్యాణి పరవళ్ళు తొక్కేస్తోంది మహాప్రభూ! లచ్చిగాడు పట్టలేక హైరానయిపోతున్నాడండీ!" అని విన్నవించింది.

అక్కడ ఎవరూ లేరా! అని ఆదుర్దా పడుతూ లేచి వెళ్ళి మహారాజు ఏమిట్రా ఇది అని అడిగాడు.

వెంటనే పంచకల్యాణి రాజుకి యెదురుగా వచ్చి "కిందకి దిగిర" మన్నట్టు తలవూపుతూ సింహనాదం అన్నంతగా సకిలించింది.

అప్పుడు లచ్చిగాడు చేతులు కట్టుకుని షికారు బయలుదేరాలి మహాప్రభూ! లేకపోతే గుర్రాన్ని పట్టలేము దేవరా! అని విన్నవించాడు.

## 2

ఆ గుర్రం అంటే మహారాజుకి ప్రాణం.

పేరుపడ్డ గాయకురాలు రావడంవల్లా, తానున్నూ సంగీతంలో నిధి కనకనూ, ఎందరెందర్నో వోడించి తోడా వేసుకున్న ఆటకాడెంతో దూరం నుంచి పనికట్టుకుని వచ్చాడు కాబట్టినీ్న "యీ వొక్కనాడూ గుర్రపు స్వారి లేకపోతే యేం" అనుకున్నాడు. కాని మహారాజు కూడా వొక్కనాడయినా ఆ గుర్రం యెక్కకుండా వుండలేదు.

ఇంతే కాక,

మహారాజుకి దాని విషయమై లచ్చిగాడెంత చెబితే అంతే. దానికి మరి తిరుగులేదు.

ఎంచేతనంటే!

తన కోసమే ఆ గుర్రం పుట్టిందనీ. ఆ గుర్రం కోసమే లచ్చిగాడున్నూ పుట్టివున్నాడనీ మహారాజుకి నమ్మకం కుదిరిపోయింది.

దీనికి పెద్ద కారణమే వుంది.

ఏడాది కిందట లచ్చిగాడు చుట్టపుచూపుగా నొకనాడు పెద్దాపురం వచ్చాడు.

పుట్టిన పాతికేళ్ళకి వాడదే పెద్దాపురం రావడం. వాడి పెత్తల్లి కొడుకు గంగులుగాడే మహారాజు సొంత గుర్రాలను చూస్తూఉండే గుర్రపువాళ్లకి మొనగాడు.

సహజంగా లచ్చిగాడు కూడా కొంచెమో గొప్పో అశ్వలక్షణాలు తెలిసినవాడే.

తరచు గుర్రాలతో మసులుతూ వుండేవాడే. కాని యేక కాలంలోనూ, యేక త్రానూ, పెద్దాపురంలో ఉన్నన్నిగుర్రాలను వాడెప్పుడూ చూచి వుండలేదు.

అంతలేసి గొప్ప గుర్రాలను కూడా చూసి వుండలేదు. కానీ, వాడికి, గుర్రాలలో మసలడంలో గంగులు గాడి దగ్గిర యేదో వొకానొక లోపం ఉండినట్టు స్ఫురించింది.

"పెట్టిపుట్టాడు కాని లేకపోతే వీడేమిటి గుర్రపువాళ్లకి మొనగాడు కావడం యేమిటి?" అని కూడా అనిపించింది.

అయితే, యేమనడానికి సాహసించలేకపోయాడు.

అక్కడికీ మెల్లిగా వెళ్లు భద్రాశ్వాన్ని దువ్వుతూ "ఏమిరా అన్నయ్యా! చిగుళ్లు కత్తిరిస్తే కుచ్చులా గుండదూ తోక?" అన్నాడు. గానివెంటనే గంగులుగాడు "గుడ్డిగుర్రపు తట్లతో మసిలేవాడివి. మహారాజులుంగారెక్కే గుర్రాల సంగతి నీకేం తెలుసురా?" అంటూ యీసడించి కూచోపెట్టాడు.

ఈ మాట అలుగులాగే గుచ్చుకుంది. కాని ఆ గుర్రాలను విడిచి వుండలేక మాటలు పెంచడం మానుకున్నాడు లచ్చిగాడు.

## 3

సరిగా ఆవేళే అయిదు గుర్రాలు వెంటపెట్టుకుని వొక అరబ్బీ వర్తకుడు పెద్దాపురం ప్రవేశించాడు.

వాటిలో మూడింటిని చూసి పెద్దాపురంలో వున్న రౌతు లందరూ ముగ్ధులయిపోయారు.

మళ్ళీ ఆ మూడింటిలోనూ యీ పంచకల్యాణిని చూసి వారు గుటకలే మింగారు.

దీంతో, వర్తకుడి దరఖాస్తుకంటే ముందు ఈ సంగతే మహారాజుకి అందింది.

వర్తకుడు, అలంకరించి యుక్తకాలంలో గుర్రాలను కోటకి తీసుకువెళ్ళాడు.

పదస్థులూ, రాజు బంధువులూ, పిన్నలూ, పెద్దలూ అనేకులూ వచ్చి చూశారు.

వారితోపాటు, వెన్ను విరుచుకుంటూ గంగులు గాడున్నూ వచ్చి చూశాడు; గాని వాడి మొగం విడలేదు.

పైగా కొంతసేపటికి పక్కకి తప్పుకుంటూ "మా గుర్రాలకి చాలవు" అని మూతి ముడుచుకున్నాడు వాడు.

అది విని. మనస్సులో చాలా నొచ్చుకుని లచ్చిగాడు "సెబాస్! గుర్రాలంటే యివీ. ఇందులోనూ మళ్ళీ అదిగదిగో అది పంచకల్యాణి. రాజా గుర్రం అది. దానిదగ్గర నాకు నౌకరీ దొరికితేనా నా రంగా" అంటూ వుర్రూత లూగిపోయాడు.

ఇంతలో మహారాజు వచ్చాడు.

అందరూ తప్పుకున్నారు.

గుర్రాలకి అయిదారు గజాల దూరాన నుంచున్నాడు మహారాజు.

వెంటనే పంచకల్యాణి పరమోత్సాహంతో సుతారంగా సకిలిస్తూ నాట్యం చేసింది.

దాన్ని చూశాటప్పటికి మహారాజు మనస్సు కూడా గుబగుబ లాడిపోయింది.

ఇలాగ మహారాజుని చూసి గుర్రమూ, గుర్రాన్ని చూసి మహారాజూ ముగ్ధులు కావడం కనిపెట్టి వర్తకుడు ఉప్పొంగి పోయాడు.

వెంటనే అతను "మహాప్రభూ! మాదేశం మొదలు ఇక్కడికి వచ్చేదాకా ఈ క్షణం దాకా దీన్ని అనేకులు చూశారు, కాని యిది వారికేసి చూడలేదు. ఏలినవారు కళ్ల బడగానే నృత్యం చేసిందిది. దీన్ని బట్టి యిది యేలిన వారి కోసమే పుట్టినట్టు కనబడుతోంది"అని చెబుతూ దాన్ని మహారాజుకి నజరు పెట్టాడు.

అందుకు మరీ సంతోషించి మహారాజు వర్తకుణ్ణి చాలా గొప్పగా సత్కరించి, మరో రెండు గుర్రాలు ఖరీదుకి పుచ్చుకున్నాడు.

ఇదంతా చూశాటప్పటికి లచ్చిగాడికి పారవశ్యం కలిగింది.

## 4

ఎప్పుడూ సన్నిధిని ఉండే హితైషులు "వెంటనే వాకమాటు స్వారి వెళ్ళడం మంచి"దని చెప్పారు.

ఈ సమయం దాటితే మరి నెలా పది రోజులదాకా మంచి ముహూర్తం లేదని ఆస్థాన సిద్ధాంతి కూడా విన్నవించాడు.

"ఈ గుఱ్ఱాన్ని యెక్కడానికి తమరే మొదటివారు మహాప్రభూ! కనక యిప్పుడే వొకమారు స్వారీ వెడితే చూసి నేను కూడా సంతోషిస్తాను దేవరా" అంటూ వర్తకుడున్నూ చాలా చాలా ప్రార్థించాడు.

తన కోరికకూడా అదే కాగా "సిద్ధం చెయ్యరా" అని గంగులు గాడికి చెప్పి, దుస్తులు మార్చుకోడానికి మహారాజు లోపలికి వెళ్ళాడు".

వెంటనే గంగులుగాడు కళ్ళెం పుచ్చుకుని బయలుదేరాడు.

జీను పట్టుకుని వాడివెనుక మరొక గుఱ్ఱపువాడు బయలుదేరాడు.

తక్కిన అలంకారాలు పుచ్చుకుని మరికొందరున్నూ వెంబడించారు.

కాని ఆ గుఱ్ఱం వొక్కణ్ణీ చేరనివ్వలేదు.

మొదట అది గంగులుగాడి గుండెలు పగిలేటట్టు ముట్టెతో విసిరి కొట్టింది.

తరువాత యెగిరి మరిద్దర్ని తన్నింది.

చివరికి, తోక ఝాడించి మరొకడికి దిమ్మెక్కించింది.

ఈ పెంకితనం చూసి మొదట రిచ్చపడి, తరువాత సిగ్గుపడి, చివరికి దిగాలుపడి ఎలాగయినా తన మర్యాద కాపాడుకోవాలని బుజ్జగిస్తూ వర్తకుడున్నూ ప్రయత్నించాడు. కాని అతని సత్కారం అతనికి ముట్టింది కనుక అతగాణ్ణి కూడా అది విదిలించి కొట్టింది.

అందరూ ఖిన్నులయిపోయారు.

## 5

ప్రభువు మళ్లీ వచ్చాటప్పటికిదీ స్థితి.

ఎప్పుడెప్పుడనుకుంటూ మనోవేగంతో వచ్చిన ప్రభువు వచ్చిన గుఱ్ఱం వచ్చినట్లే వుండడం చూసి "ఏమిరా?" అన్నట్టు గంగులుగాడికేసి కొంచెం కరుగ్గా చూశాడు.

దాని మీద గజగజ వణికిపోతూ జరిగిందంతా చెప్పి గుఱ్ఱపు వాళ్లు పడిపడి దణ్ణాలు పెట్టారు.

ఇదంతా చూస్తూ లోపల్లోపల నవ్వుకుంటూ నిశ్చలంగా నుంచుని వున్నాడు లచ్చిగాడు.

మహారాజు వాడి నైలక్షణ్యం గుర్తించాడు; కాని కొత్తవాడు కావడంవల్ల పలకరించలేదు. వాడుకూడా మహారాజుతో సాహసించి మాట్లడలేక మిడుతూ మిడుతూ చూసి వూరుకున్నాడు.

గంగులుగాడి కిది పౌరుషం కెల్పించింది.

తక్కినవాళ్లు కూడా లచ్చిగాడికేసి గుర్రుగా చూసి, "ఊరుకుంటే యెలాగా?" అన్నట్టు గంగులుగాడికేసి చూశారు.

అందరూ కలసి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి, తన్నులు తినడం తరవాయిగా, మళ్ళీ విఫలులయినారు.

ఆది చూసి లచ్చిగాడు అలాగే నుంచుని చిరునవ్వు నవ్వాడు.

అది మహారాజు కళ్లబడింది.

ఆ చిరునవ్వులో అహమిక ఉండడం గుర్తించి మహారాజు "ఎవర్రా నువ్వు" అని గంభీరంగా చూస్తూ అడిగాడు.

"నేను గంగులుగాడి పినతల్లి కొడుకుని బాబయ్యా! నా పేరు లచ్చిగాడండి"అని వంగి దణ్ణం పెడుతూ బదులు చెప్పాడు వాడు.

"ఏవూరు నీది?"

"పుట్టకొండ మహాప్రభూ"

"ఎందుకురా నవ్వుకుంటున్నావూ?"

"కారణం తరువాత మనవి చేసుకోవడానికి ముందు గుర్రానికి కళ్లెం పెట్టి జీను వెయ్యడానికి సెలవిప్పించండి దేవరా".

ఇది విని గుర్రపువాళ్లందరూ యేక కాలంలో "వాడి వల్ల యేమవుతుంది మహాప్రభూ?" అని తమ అభిజాత్యం వొలకపోసుకున్నారు.

దాని మీద మళ్లీ చిరునవ్వు కనపరిచాడు లచ్చిగాడు.

మహారాజుకి ఆ చిరునవ్వులో చాలా ఆత్మవిశ్వాసం కనపడింది.

"ఎందుకు సెలవివ్వకూడదూ?" అనిన్నీ అనిపించింది. అయినా తొందర పడక "యెంతో అనుభవం ఉన్న అంత మందిని విసిరికొడుతోందే అది, నీధైర్యం యేమిటిరా?" అని అడిగాడు.

"నన్ను చేరదీస్తుంది బాబయ్యా"

"కారణం"

"చెప్పలేనండి. కాని నిదర్శనం చూపించుకుంటాను, సెలవు దయచేయించండి".

"చూపించలేకపోతే"

"తల కొట్టి వెయ్యవచ్చునండి"

దీనిమీద వాడివల్ల యెంతో అపరాధం జరిగిపోయినట్టు ఆత్రపడుతూ "నీకు బతకాలని లేదుట్రా?" అని వురుముతూ లచ్చిగాణ్ణి కసిరి, "వాడు కళ్లు తెరవని పసికుంక మహాప్రభూ! తల్లికీ, తండ్రికీ వొక్కడే బిడ్డడండి. వాడి మాటలు లెక్క చేయక కరుణించి విడిచి పెట్టండి దేవరా"అని మహారాజుని ప్రార్థించాడు గంగులుగాడు.

"అయితే మరి చెయ్యవలసిందేమిట్రా?" అని అడిగాడు మహారాజు.

"ఇది పెంకి గుఱ్ఱం దేవరా! వారం దినాలు తిండీ తిప్పలూ మానేస్తే తరువాత చెప్పినట్టల్లా వింటుందండి" అని జవాబు చెబుతూ గంగులుగాడు మీసాల మీదికి చెయ్యి పోనిచ్చుకున్నాడు.

దీనికి మహారాజు మనస్సు చివుక్కుమంది.

అందుకు సాయం "రామరామా" అంటూ వొకమాటు చెవులు మూసుకుని, లచ్చిగాడు "అది జాతయిన గుఱ్ఱం మహాప్రభూ! దాన్ని పస్తు పెట్టడం జయకరం కాదండి. దాని సంగతి వీళ్లు తెలుసుకోలేకపోయారండి. అది గంగిగోవు దేవరా! నీతయినవాణ్ణి కాని అడ్డమైన వాళ్ళనీ చేర నివ్వదండి అది" అని గుఱ్ఱానికి దణ్ణం పెడుతూ చెప్పాడు లచ్చిగాడు.

ఈ మాట మహారాజు నల్ల గుండెలో నాటుకుంది. లచ్చిగాడి సంగతి అలా ఉండగా తన మాట తాను ఆ స్వారీ చెయ్యలేకపోతే? అసలు ఆరోహణమే చెయ్యలేకపోతే?

మహారాజు హృదయం కుతకుత లాడిపోయింది. మనస్సు గజిబిజి అయిపోయింది.

అప్రయత్నంగా నాలుగు వేపులా చూశాడు.

అందరి కళ్ళూ తన మీదే ఉన్నాయి.

ఆ కళ్ళలో నీతయిన వాళ్లెవరెవరో యిప్పుడు తెలిసిపోతుంది" అన్న భావం ఉన్నట్టున్ను స్ఫురించింది.

దాంతో ఉద్రిక్తుడయినాడు.

వెంటనే "యేదీ నిదర్శనం చూపించూ" అని లచ్చిగాణ్ణి చురుగ్గా చూశాడు.

ప్రభువు చూపుల్లో "జ్ఞాపకం ఉందా? తల యెగిరిపోతుంది సుమా" అన్న ముదలకింపు ఉండడం లచ్చిగాడికి స్పష్టంగా కనబడింది.

అయినా అధైర్యం కాక సాహసమే కలిగింది వాడికి.

శరీరం పొంగి పోయింది.

నూత్నావేశం కూడా కలిగింది.

దాంతో పరవశుడై ముందు మహారాజు ఆజ్ఞ. వంగి దోసిలివొగ్గి అందుకుని తరువాత పదడుగులు ముందుకువేసి,. పాగా తీసి నడుముకి చుట్టుకుని గుఱ్ఱం కేసి చూస్తూ నేల అంటి కళ్ళకద్దుకుని మళ్లీ ముందుకి అడుగు వేశాడు.

వెంటనే ప్రసన్నంగా చూస్తూ గుఱ్ఱంవాడి కభిముఖం అయింది.

రాజు చకితుడైనాడు.

గుఱ్ఱపు వాళ్లు పిడుగు పడ్డట్టయిపోయారు.

తక్కిన వారందరూ విస్మితులయినారు.

కళ్ళు చికిలించుకుని మళ్లీ అందరూ చూశాటప్పటికి లచ్చిగాడి భుజం మీద తన మెడ ఉంచుకుని గుఱ్ఱం ప్రీతి నెరుపుతోంది.

"బాబా! నాబాబా! దేవలోకం నుంచి వచ్చావు నువ్వు. భూలోక దేవేంద్రులవారి దివాణంలో పడ్డావు. నీకేం లోటురా బాబా". అంటూ దాని మెడ తట్టుతున్నాడు లచ్చిగాడు.

·గుఱ్ఱపు వాళ్లందరూ తలకాయలు పొట్టల్లో పెట్టుకున్నారు.

వర్తకుడు మొదట కొంచెం స్తబ్ధుడై, తరువాత సంతుష్టుడై మహారాజుకి సలాం మీద సలాం చేసి " అంతా యింద్రజాలంగా ఉంది మహాప్రభూ! ఈ గుఱ్ఱం కోసమే యీ పెద్ద మనిషి పుట్టినట్టు కనపడుతోంది. ఈ అనుబంధం ఆశ్చర్యకరంగా ఉంది. నా జన్మ ధన్యం అయింది దేవరా" అంటూ పొంగిపోయాడు.

ఈ సందుబాట్లో, లచ్చిగాడు క్షణంలో అలంకారాలన్ని తొడిగి, కళ్లెం పెట్టి, జీను కట్టి గుఱ్ఱాన్ని మహారాజు సన్నిధికి విడిచిపెట్టి, అందర్నీ

తప్పుకోమన్నట్లు వొక్కమాటు దర్జాగా చెయ్యి తల వూపి, "ఒక్కమారు దేవుణ్ణి ప్రార్థించుకుని, బాబాని బుజ్జగించి యెక్కండి దేవరా" అని విన్నవించాడు.

మహారాజు ఆనంద ముగ్ధుడయిపోయాడు. వెంటనే లచ్చిగాడు చెప్పినట్టుచేసి వొక్క విసురున గుఱ్ఱం ఎక్కాడు. గుఱ్ఱం యెగిరిపోయింది.

## 6

అది మొదలు

ఏదన్నా మానవచ్చుగాని, అనుదినమూ గుఱ్ఱపుస్వారి మానడానికి వీలులేదు.

మహారాజయినా మానలేదు.

గుఱ్ఱం యెక్కగానే ప్రభువు ఏదో దైవిక శక్తి ఆవహించినట్టవుతాడు.

దీని కుపబలంగా ఆ గుఱ్ఱం వచ్చింది మొదలు మహారాజుకి దినదినమూ ప్రాభవం పెరిగిపోయింది. వయస్సు కొంచెం మళ్లినా, మళ్ళీ నవయౌవనం అంకురించినట్టయింది.

ఇదిలా వుండగా–

మహారాజుకి, లచ్చిగాడి మీద అమిత పుత్రవాత్సల్యం కలిగిపోయింది.

వాడు గుఱ్ఱపు వాళ్ళందరికీ మొనగాడు అయిపోయాడు.

వాడిలో కూడా చాలా మార్పు, చాలా విశిష్టతా యేర్పడింది.

షష్టీగడియలూ వాడికి గుఱ్ఱంతోనే సరిపోతుంది. గుఱ్ఱం కూడా వాడి కను సన్నల్లోనే మెలుగుతుంది.

గుఱ్ఱమూ, వాడూ వొకచోటున్నంతసేపూ యేదో ముచ్చటలాడుకుంటున్నట్టే వుంటారు.

ఆడుకుంటున్నట్టూ వుంటారు.

మాలీసుచేస్తూ, ఆగి ఆగి కువకువలాడినట్టు వాడేమిటేమిటో చెబుతూ వుంటాడు.

అందులో గుఱ్ఱానికి చక్కని ముక్తాయింపులు కనబడతాయి.

గుఱ్ఱమున్నూ మహానందంతో సకిలిస్తూనే వుంటుంది.

అందులో లచ్చిగాడికి స్వర కల్పన కనబడుతుంది. దాంతో ఉభయులకూ పారవశ్యం కలిగినట్టుంటూ వుంటుంది.

రోజల్లా యిల్లా మల్లెపూల తెప్పమీద తేలిపోతూ ఉండగా సాయంత్రం స్వారి.

సరిగా ఆ సమయం సమీపించాటప్పటికి గుఱ్ఱానికి నరాలు పొంగుతున్నట్టు కనబడతాయి.

లచ్చిగాడికి శరీరంలో మెరుపు తీగలు పాకిపోతున్నట్టుంటాయి.

అంతా సిద్ధమయిందని కబురు వచ్చాటప్పటికి మహారాజు ఎలా వున్న వాడలా లేచి బయలుదేరతాడు.

ముగ్గురికీ, చివరికి, క్షణంలో వొక్కమాటు భూప్రదక్షిణం చేసి వచ్చినట్టనిపిస్తుంది.

అప్పటికీ దివ్య సుఖానుభూతీ, ఆనంద పారవశ్యమూ మేళవించగా ముగ్గురికీ హృదయాలు తేరుకుంటాయి.

కాగా, లచ్చిగాడు గుఱ్ఱం విషయమై తనకి తోచింది తోచినట్టు చేప్పేస్తూ వుంటాడు.

వినీ వినడంతోనే మహారాజు లచ్చిగాడు చెప్పినట్టల్లా చేసేస్తూ వుంటాడు.

ఆవేళ కూడా అలాగే చేశాడు.

గుఱ్ఱం యింగితం తెలిశాక, లచ్చిగాడి పిలుపు కూడా అందాక మహారాజు వొక్క క్షణమయినా అక్కడ వుండలేకపోయాడు.

ఎప్పుడూ లేంది దుస్తులు మార్చుకోవడం క్షణంలో అయిపోయింది.

అవలగ్న బంధంలో కట్లారి వుంచడానికి వచ్చిన యువతితో "చదరంగం యిక రేపే" అని శిరస్సున పాగా అమర్చడానికి వచ్చిన గుబ్బెరతో "సంగీత కచేరీ భోజనాలయినాకే" అని పాదాలకి పావుసులు తొడగడానికి వచ్చిన ముద్దరాలితో "అభ్యంగానికి సిద్ధం చేయించు" అని చెప్పి మహారాజు కిందికి వచ్చాటప్పటికీ అలంకృతమై పంచకల్యాణి సర్వసిద్ధంగా వుంది.

"కొంచెం ఆలస్యం అయినందుకు, ఇవాళ గుఱ్ఱం మేఘాల మీద యెగిరిపోతుంది దేవరా! కనుక మొదట కోట చుట్టూరా తిరిగి వుధృతం తగ్గాక, అప్పుడు పాండవుల మెట్టకేసి బయలుదేరండి మహాప్రభూ" అని విన్నవించుకుని లచ్చిగాడు పదిఅంగలు కూడావేశాడు.

## 7

పాండవుల మెట్ట దాటి అరకోసుదూరం వెడల్పున కాలువ. దాని నిండా యెప్పుడూ యేనుగీత నీరు. అది తిరగేసుకు వెళ్ళాలంటే యెగువకి, దిగువకీ కూడా రెండేసి కోసులు వెళ్ళాలి.

మొదటినాడు "ఏమిటి చెయ్యడం" అని మహారాజు ఆలోచనలో పడగా "ఫరావాలేదు, గుఱ్ఱం దాటేస్తుంది దేవరా" అని లచ్చిగాడు ధైర్యం చెప్పాడు.

ప్రయత్నించగా, గుఱ్ఱం వెళ్ళాటప్పుడూ, వచ్చేటప్పుడు కూడా అతి సునాయాసంగా దాటేసింది.

మహారాజుకి చాలా ఆనందం కలిగింది.

అది చాలా ముచ్చటగా కూడా కనపడింది.

అంచేత ప్రతి దినమూ, గుఱ్ఱపు స్వారీ కదే దారి.

కానీ ఆ వేళ, కాలవ యింక వంద గజాలలో ఉందనగా వేగం హెచ్చించిన్నీ గట్టుమీదకి వచ్చాటప్పటికీ గుఱ్ఱం హఠాత్తుగా ఆగిపోయింది.

మహారాజు నిర్విణ్ణుడయిపోయాడు.

"ఏం చెప్మా?" అనుకుంటూ అలాగా యిలాగా పారజూసిన్నీ కారణం కనిపెట్టలేక, అయినా వెనక్కి మళ్లడానికిష్టపడక, మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు.

గుఱ్ఱం కూడా కసిగానే ఉండినట్టు కనపడింది. కాని దాటదు. ఎంత హెచ్చరించినా వుడాయించదు.

ఈ వెనక్కీ, ముందుకీ వెళ్లడాలు అంతదూరం నుంచే చూసి, కంగారు పడుతూ లచ్చిగాడు వచ్చాటప్పటికి ప్రయత్నం మానుకుని మహారాజు అలాగే వుండిపోయాడు.

"ఏం బాబయ్యా!" అంటూ ఆత్రంగా అడిగాడు లచ్చిగాడు.

"గుఱ్ఱం దాటటం లేదురా"

"........................."

"ఉడాయించటమే మానేసిందిర"

"........................."

"అవతలిగట్టున కాని, కాలవలో కాని యేవయినా భయకారణం ఉందేమో చూడు"

లచ్చిగాడు బాగా పరకాయించాడు కానీ ఏమీ కనపడలేదు. తల దోక్కుంటూ, ముందుకి వెళ్ళినుంచుని కళ్ళలోకి గంభీరంగా చూశాడు వాడు.

గుఱ్ఱం తల విసిరింది.

ఏదో పొరపాటు జరిగినట్టు తోచింది కాని విడిపోలేదు ఏర్పడించుకోలేక మళ్ళీ నాయెదుట వొకమాటురికించండి బాబయ్యా," అన్నాడు వాడు.

మహారాజు చాలాకసిగా ఉరికించాడు.

కాని అంతా వ్యర్థం

గుఱ్ఱం సరిగా పరిగెత్తనేలేదు.

మహారాజుకి మనస్సు చెడిపోయింది.

లచ్చిగాడికి గుండెలు కొట్టుకున్నాయి. దానిమీద "ఏం బాబా లచ్చిగాడికి వాళతో భూమ్మీద నూకలయిపోయాయా?" అంటూ వొక్కక్షణం కళవళపడి అయినా వుత్తర క్షణంలో ప్రయత్నించి నిలవరించుకుని మోకాళ్ళ మీద చేతులానుకుని వంగుని చూసి "పాగా వొరిగినట్టుంది చూడండి బాబయ్యా!" అంటూ పక్కకి తప్పుకున్నాడు వాడు. చూడగా అలాగే వుంది.

అందుకాశ్చర్యపడుతూ మహారాజు పాగా బాగా సద్దుకున్నాడు.

అంతే

వెంటనే గుఱ్ఱం తనకితానే వెనక్కి వెళ్ళి గుండెలు దూసుకుపోయేటట్టు చూస్తూ వొక్క పరుగున వచ్చి, వొక్క వూపున కాలవేకాక కాలువ గట్టుకూడా దాటేసింది.

ఇది జరిగిందీ, విన్నదీని, రచన మట్టుకు నాది.

◆ ఆంధ్రపత్రిక - 15-5-1940 ◆